చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

దామరచెర్వులో ఇటుక బట్టీల వద్ద మాట్లాడుతున్న సీఆర్పీ రాజు

రామాయంపేట రూరల్, జనవరి 25: బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని సీఆర్పీ రాజు అన్నారు. శనివారం మండలంలోని దామరచెర్వు గ్రామంలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న బడీడు పిల్లల కోసం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న తాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లోని దుకాణాలు, ఇటుక బట్టీలు, ఆయా కేంద్రాల్లో తనిఖీ చేసినట్లు తెలిపారు. యజమానులు బడీడు పిల్లలతో పనులు చేయించొద్దని సూచించారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ నియామకం

నిజాంపేట, జనవరి 25: మండలంలోని నార్లపూర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు సుధాకర్, మండల అధ్యక్షుడు అమర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటైంది. కమిటీ అధ్యక్షుడిగా రాము, ఉపాధ్యక్షుడిగా సురేశ్, కోశాధికారిగా కుమార్, ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, కార్యదర్శిగా రఘువర్ధన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎసురాములు, పరుశురాములు, నవీన్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల్లో సగరులు సత్తా చాటాలి

రామాయంపేట, జనవరి 25: స్థానిక సంస్థల ఎన్నికల్లో సగరులు సత్తా చాటాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్, జిల్లా అధ్యక్షుడు సందిల సాయిలు, ప్రధాన కార్యదర్శి మర్కు నగేశ్ పేర్కొన్నారు. శనివారం రామాయంపేటలోని సంఘం కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

రామాయంపేట రూరల్, జనవరి 25: మండలంలోని దామరచెర్వు గ్రామంలో వాలీబాల్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ పోటీలను గ్రామ యువకుడు పిట్ల నరేశ్ సొంతంగా నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో 7 జట్లు పాల్గొన్నాయి.

పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలి

చిలిపిచెడ్, జనవరి 25: చండూర్‌లోని అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించి, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. చిన్నారులకు పోషణ లోప నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ టీచర్లు శశికళ, యాదమ్మ సమావేశం ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చిలిపిచెడ్, జనవరి 25: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.8.09 లక్షల చెక్కులను పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి శనివారం అందజేశారు.

యువకుడు అదృశ్యం

రాగి గణేశ్

రామాయాంపేట, జనవరి 25: యువకుడు అదృశ్యమైన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుతారిపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న సుతారిపల్లికి చెందిన రాగి గణేశ్ ఎప్పటిలాగే ఇంట్లో నుంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో యువకుడి భార్య రాగి శోభ ఫిర్యాదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఓటుతో దేశ రాత మార్చవచ్చు

- ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- 18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ: ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

ధ్యాన్‌చంద్ చౌరస్తాలో మానవహారం నిర్వహించిన విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ/ చేగుంట/ రామాయంపేట/ నిజాంపేట/ పెద్దశంకరంపేట/ చిలిపిచెడ్/ కొల్చారం / అల్లాదుర్గం/వెల్దుర్తి/శివ్వంపేట/ కౌడిపల్లి/ చిన్నశంకరంపేట, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద ఓటరు అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ధ్యాన్‌చంద్ చౌరస్తా మీదుగా స్టేడియం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కు నిజాయితీతో ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది శక్తివంతమైన ఆయుధమని, ఓటును అమ్ముకోకుండా తమ బాధ్యతగా వేయాలన్నారు. ఓటరు ప్రతిజ్ఞ చేసి, అందరికీ జాతీయ ఓటర్ల దినోత్సవ శుభకాంక్షలు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, రంగోలి పోటీల విజేతలకు కలెక్టర్ ప్రశంసా పత్రంతో పాటు మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవో రమాదేవి, డీఎస్‌వో రాజిరెడ్డి, జిల్లా యువజన అధికారి నాగరాజు, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు. చేగుంట జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో నిర్వహించిన మాక్ పోలింగ్‌లో ఎంఈవో నీరజ, తహసీల్దార్ నారాయణ, ఆర్ఐ జైభారత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిజాంపేటలో ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఓటర్ దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులతో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. రామాయంపేట తహసీల్దార్ రజినికుమారి, ఎంపీడీవో షాజులుద్దీన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ సందేశాన్ని వినిపించి, ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని నర్సాపూర్ ఆర్డీవో భూపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

కొల్చారంలో విద్యార్థులతో ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దార్

శివ్వంపేట ప్రధానరహదారిపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పెద్దశంకరంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్, విద్యార్థులు

వెల్దుర్తి అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం

రామాయంపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్

నర్సాపూర్‌లో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

కౌడిపల్లి: ప్రభుత్వ జూనియర్ కశాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకావిష్కరణ - కలెక్టర్ రాహుల్‌రాజ్

గణతంత్ర వేడుకలు సిద్ధమైన కలెక్టరేట్

మెదక్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : గణతంత్ర వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగం, తదుపరి విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ సేవలందించిన జిల్లా అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేస్తారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ శకటాల పరిశీలన, అసెట్స్ పంపిణీ ఉంటుందని తెలిపారు. అతిథులకు ఏర్పాట్లు, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

సంక్షేమ పథకాల అమలుకు నేడు శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను నేటి నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాలుగు పథకాల అమలుకు చేపట్టాల్సిన చర్యల గురించి తెలిపారు. అనంతరం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లను, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, సంక్షేమ పథకాల అమలును ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. ఎంపిక చేసిన గ్రామంలో పథకాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాలకు వెళ్లడానికి ముందే ఆయా పథకాల లబ్ధిదారుల జాబితాను పరిశీలించుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నగేశ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల్లో అక్షరాస్యత వృద్ధి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 25: గిరిజన గురుకుల కళాశాలలు ఏర్పాటుతో విద్యార్థినుల్లో అక్షరాస్యత వృద్ధి చెందిందని గురుకులాల రీజినల్ అధికారి గంగరాం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మహిళా గిరిజన డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. గంగరాం మాట్లాడుతూ డిగ్రీతోనే చదువు మానేయకుండా ఎంచుకున్న రంగాల్లో పరిపూర్ణంగా సఫలం కావాలన్నారు. డిగ్రీనభ్యసించిన మూడేండ్లలో కళాశాలలోని వనరులను వినియోగించుకుని విజ్ఞానంతో మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డి

సహకారంతోనే చైర్మన్ అయ్యా

చివరి సమావేశంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

మాట్లాడుతున్న వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 25: మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి సహకారంతోనే మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యానని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అన్నారు. మున్సిపల్ చివరి సమావేశాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో జరిగిన ఎన్నికల్లో 12వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికై, హరీశ్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డి, సహకారంతో చైర్మన్‌గా ఎన్నికై, ఐదేండ్లు ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందన్నారు. ఈ కాలంలో తన సహచర కౌన్సిల్ సభ్యుల సహకారంతో పట్టణాభివృద్ధి కృషి చేశానన్నారు.

అందరి సహకారం మరువలేనిది: వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

పట్టణాభివృద్ధికి అందరి సహకారం మరువలేనిదని వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. ఐదేండ్లలో రెండేండ్లు కరోనాతో సమయం గడిచిపోయిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి నిధులతో మున్సిపాలిటీల అభివృద్ధి చేశామన్నారు. కౌన్సిల్ సమయంలో అప్పుడప్పుడు చిన్నచిన్న ఘటనల చోటు చేసుకోవడం జరుగుతూ ఉంటాయని, అలాంటి సమయంలో ఎవరి మనస్సైనా నొప్పించి ఉంటే క్షమించాలన్నారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు సైతం మాట్లాడారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌ను మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లను చైర్మన్, కమిషనర్ సత్కరించి మెమోంటోలు అందజేశారు. సమావేశంలో మున్సిపల్ డీఈ మహేశ్, టీపీవో భూపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

సబ్ జైల్‌ను తనిఖీ చేసిన జిల్లా జడ్జి లక్ష్మీశారద

మాట్లాడుతున్న జిల్లా జడ్జి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, జనవరి 25: మెదక్ సబ్ జైల్‌లో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద పాల్గొని ఖైదీలకు వారి హక్కుల గురించి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య, స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ ప్రభాకర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించిన కౌన్సిలర్

శివ్వంపేట, జనవరి 25: నర్సాపూర్‌లోని 14వ వార్డులో నీటి సమస్య నెలకొనడంతో పరిష్కారానికి కౌన్సిలర్ సరిత ఆంజనేయులుగౌడ్ హనుమాన్ ఆలయం వద్ద శనివారం బోరు వేయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమోద్దిన్, కౌన్సిలర్లు లలితాభిక్షపతి, రాంచందర్, నాయకులు షరీఫ్, మోయిన్, నవీన్‌గౌడ్, సంతోష్, రవి, నాగరాజు ఉన్నారు.

ఎన్నికలా.. ఇన్‌చార్జి పాలననా?

- నేటితో ముగియనున్న కౌన్సిలర్ల పదవీకాలం
- రేపటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన

మెదక్ మున్సిపల్ కార్యాలయం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 25: మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం నేటి నుంచి ముగియనున్నది. పాలకవర్గాలు మాత్రం తీవ్ర నిరాశలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయామని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా పట్టణ ప్రగతి ద్వారా ప్రతి మున్సిపాలిటీకి జనాభాకు అనుగుణంగా అభివృద్ధి నిధులు వచ్చేవి. తద్వారా వార్డుల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరిగేవి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పట్టణ ప్రగతి నిధులు నిలిపేయడంతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి.

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు

జిల్లాలో మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీలు ఉన్నాయి. 2020 జనవరి 22న ఎన్నికలు నిర్వహించారు. నాలుగు మున్సిపాలిటీల్లోనూ బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేసింది. ఫిబ్రవరి 14 నుంచి పట్టణ ప్రగతి ప్రారంభించారు. తదనంతరం నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్ బీజేపీలో చేరడంతో అవిశ్వాస తీర్మానం పెట్టడంతో చైర్మన్ పదవీ నుంచి తప్పుకున్నారు. తూప్రాన్ మున్సిపాల్ చైర్మన్ రవీందర్‌గౌడ్‌పై కూడా అవిశ్వాస తీర్మానం పెట్టాలని పాలకవర్గ తీర్మానించింది. ఆ తరువాత అవిశ్వాసంలో ఓటమీ పాలయ్యారు.

ముగిసిన పదవీ కాలం..

మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. ఆ తరువాత ఎన్నికలు నిర్వహించే వరకు ఇన్‌చార్జిల పాలన కొనసాగుతుంది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా జనాభా ప్రకారం రూ.30 నుంచి రూ.60 లక్షల వరకు నిధులు వచ్చేవి. ఈ నిధులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నిలిచి పోవడంతో సమస్యలు పేరుకు పోయాయి. ఇతర ఎలాంటి నిధులు రాకపోవడంతో చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లు మున్సిపాలిటీల చుట్టూ తిరుగుతున్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి నిధులు ఇలా వచ్చేవి..

మున్సిపాలిటీ	జనాభా	వార్డులు	వచ్చే నిధులు (రూ.లక్షల్లో)
మెదక్	51,027	32	34
తూప్రాన్	23,673	16	22
నర్సాపూర్	18,813	15	20
రామాయంపేట	17,880	12	16

హోంగార్డులకు తపాలా జీవిత బీమా: ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

హోంగార్డ్‌కు తపాలా బీమా బాండ్‌ను అందజేస్తున్న ఎస్పీ

మెదక్ అర్బన్, జనవరి 25: హోంగార్డులకు తపాలా జీవిత బీమా పథకం ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. హోంగార్డ్ సిబ్బందికి పదవీ విరమణ తర్వాత ఎలాంటి బెనిఫిట్స్ అందవని, వారు ఇప్పటి నుంచే భవిష్యత్తుకు ఉపయోగపడేలా డబ్బును సేవ్ చేసుకునేందుకు పోస్టల్ శాఖ వారితో మాట్లాడి, తపాలా జీవిత బీమా తీసుకోవాలని సూచించారు. వారికి జీవిత బీమా పథకం బాండ్స్ పంపిణీ చేశారు.

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డికి ఆహ్వానం

కౌడిపల్లి, జనవరి 25: కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌లో ఐదు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నందున నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి గౌడ సంఘం ఆధ్వర్యంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 31న గణపతి పూజ, ఫిబ్రవరి 1న చండీహోమం, 2న రేణుకామాత విగ్రహప్రతిష్ఠ, 3న గంగస్నానం, 4న బోనాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు రంగంపేట పీఠాధిపతి మాధవానందస్వామి హాజరుకానున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సాన రామాగౌడ్, శంకర్‌గౌడ్, కిశోర్‌గౌడ్, అంజాగౌడ్, ప్రవీణ్‌గౌడ్, మొగులాగౌడ్, భిక్షపతిగౌడ్, గౌడ సంఘం సభ్యులు ఉన్నారు.

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరణ

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 25: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఉదయం జాతీయ జెండాను పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు పట్టణ కన్వీనర్ ఆంజనేయులు, కో కన్వీనర్ గడ్డమీది కృష్ణాగౌడ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

బీఎల్‌వోల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం

శివ్వంపేట, జనవరి 25 : మండలంలో బీఎల్‌వోలుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్ల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం విడుదల చేయాలని బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు పనిభారం ఉన్నా ప్రభుత్వ ఆదేశాల మేరకు బీఎల్‌వోలుగా పని చేస్తున్నారన్నారు. వారి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం అందజేశారు.

విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలి: డీఈవో



రాంపూర్ పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

నిజాంపేట, జనవరి 25: పది విద్యార్థుల సందేహాలను ప్రత్యేక తరగతుల్లో నివృత్తి చేయాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. శనివారం మండలంలోని రాంపూర్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన విద్యార్థి తల్లిదండ్రులు –ఉపాధ్యాయుల సమావేశానికి డీఈవో హాజరై మాట్లాడారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు స్నేహపూర్వకంగా నడుచుకోవాలన్నారు. పది పరీక్షలు సమీపిస్తున్న వేళ ఉపాధ్యాయులు సబ్జెక్ట్‌ల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శనమూర్తి, హెచ్ఎం పద్మారెడ్డి, ఇందిర, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు గౌస్ తదితరులు ఉన్నారు.

బియ్యపు గింజపై జాతీయ పతాకం

పెద్దశంకరంపేట, జనవరి 25: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దశంకరంపేటకు చెందిన సూక్ష్మ కళాకారుడు అవుసుల శ్రీనివాసచారి శనివారం బియ్యం గింజపై జాతీయ పతాకాన్ని రూపొందించాడు. జండాను బొటన వేలిపై నిలబెట్టాడు.

చెరువులో పడి వ్యక్తి మృతి

శంకర్ (ఫైల్)

చిన్నశంకరంపేట, జనవరి 25: చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అగ్రహారంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గవ్వలపల్లి పంచాయతీ పరిధిలోని అగ్రహారం గ్రామానికి చెందిన కంతి శంకర్(39) శుక్రవారం గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీర్స్ ట్రోఫీ విజేత మిషన్ భగీరథ టీమ్

ట్రోఫీని అందుకుంటున్న మిషన్ భగీరథ జట్టు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 25: పని ఒత్తిడితో విధులు నిర్వహించే ఉద్యోగుల కోసం స్నేహపూర్వక క్రికెట్ టోర్నీని నిర్వహించారు. జిల్లాలోని మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఇంజినీర్లు శనివారం ఆటవిడుపుగా గడిపారు. ఇరు శాఖల అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి పోటీలో పాల్గొన్నారు. ఫైనల్‌లో మిషన్ భగీరథ జట్టు, పంచాయతీ ఇంజినీర్ల జట్టుపై విజయం సాధించింది. పోటీల్లో మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ జగదీశ్వర్, ఈఈ నర్సింలు, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ నాగభూషణం, ఇంట్రా ఈఈ సంపత్, డిప్యూటీ ఇంజినీర్లు పాండురంగారెడ్డి, విజయభాస్కర్, శ్రీనివాస్, అమరేశ్వర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.